వ్యసనాలు దీర్ఘకాలిక వ్యాఘుల్లాంటివి. వాటితోనే పురుషులు తమ జీవితాలకు అర్థాలనూ, అనర్థాలను వెతుక్కుంటూ సార్థక్యతను పొందజూస్తారు. సరదాలు స్వల్పకాలిక సుఖానికి సాధనాలు. వాటితోనే స్త్రీలు తమ వర్తమాన బ్రతుకులో కాలక్షేపానికి సుముఖమైన వాతావరణాన్ని కల్పించుకొని సత్యంప్తి పడటానికి ప్రయత్నిస్తారు. అలాంటి స్త్రీల తరగతికి చెందిందే అప్పుడే అశోక్‌నగర్ చౌరాస్తాలో "ప్లాటినమ్ ఫ్లాట్స్" బిల్డింగ్ దగ్గర ఆటోదిగిన సుమలత.

—భర్త ఓ పెద్ద కంపెనీలో కెమికల్ ఇంజనీరు. ప్రతి నెలాఖరుకూ మూడువేలరూపాయల జీతం తెల్లకవర్లో టేబుల్‌మీదకు వస్తుంది.

—ఇద్దరు పిల్లలు. అబ్బాయి సెంట్ పాల్స్‌లో నాలుగో క్లాసు చదువుతున్నాడు. అమ్మాయి రోజరీలో రెండోక్లాసులో వుంది.



—డబుల్‌డోర్ డబుల్ కలర్ హెరాల్డ్ కారుంది. సాయంత్రాలు షికార్లకూ, సినిమాలకూ, షాపింగ్‌కూ, స్నేహితుల ఇళ్ళకూ ఆ కారు వాడతారు. భర్త కంపెనీ కారులోనే ఆఫీసు కెళతాడు; ఆఫీసునుంచి వస్తాడు.

—వారిది లవ్ మేరేజి కాదు లక్ష రూపాయల కట్నంతో పెద్దవాళ్ళు ఏర్పాటు చేసిన పెళ్ళే. కట్నం కంటె ఎక్కువగా సుమలత సౌందర్యాన్ని చూసే పెళ్ళికి ఒప్పుకున్నాడు భాస్కర్. అతని చదువునూ, ఉద్యోగాన్నీ, పర్సనాలిటీనీ చూసి పెళ్ళికి తలాడించింది సుమలత.

—ప్రేమించుకొని పెళ్ళిచేసుకోవడం ప్రధానం కాదు. పెళ్ళితర్వాతభార్యాభర్తలు అన్యోన్యంగా, అనురాగంగా, ఆప్యాయంగా ఆదర్శంగా ఉండొచ్చు అనే సిద్ధాంతానికి వారి దాంపత్యం చక్కని దృష్టాంతరం. రేపు గురించి ఆలోచించే అవసరంలేని రీతిలో కాలం కదిలిపోతుంది ఆ దంపతులకు. అంత కంటే ఏం కావాలి!

—బ్యాంకులో పాతిక వేలకు తగ్గకుండా ఎప్పుడూ బ్యాలెన్స్ వుంటుంది.

—లక్షా అరవై వేలకు ఆధునిక పద్ధ




తిలో నిర్మించిన, అన్ని హంగులూగల త్రీ బెడ్ రూం ఫ్లాట్ కొనుక్కున్నారు. అందులో ఖరీదైన ఫర్నిచర్, టి. వి, రేడియో, కుకింగ్ రేంజర్, వాషింగ్ మిషీన్, రైస్ కుక్కర్, కాశ్మీర్ కార్పెట్లు, ఆయిల్ పెయింటింగ్స్, స్విడ్జర్లాండ్ సీనరీ వాల్ పేపరు, యూ ఫోమ్ సోఫా సెట్, డెకోలాం డైనింగ్ టేబుల్, గోద్రెజ్ ఫ్రిజ్, నిర్మల్ మోడల్ డబుల్ కాట్, వార్ డ్రోబులు, షో కేసులు, విండో కర్టెన్లు మొదలైన వెన్నో- హోదాను చాటిచెప్పే అత్యాధునిక సామాగ్రి అలంకార భూషితమై వున్నాయి.

—అన్ని పదార్థాలూ వడ్డించిన విస్తరికి కదలిక వుండదు. కాలంలో కదలిక లేకపోతే జీవితం కొండరాయిలాగే ఉండి పోతుంది. అందుచేత సుమలత కొన్ని సరదాలను పెంచుకుంది. ఆ సరదాలు ఆడవారి మనస్సుకు అతి సామాన్యమైనవి. నగలు చేయించడం, చీరలు కొనడం, ఎంబ్రాయిడరీ నేర్చుకోవడం, సినిమాలు చూడటం, మ్యాగజైన్లు కొనడం సీరియల్స్ చదవడం, వారానికోసారి వెళ్ళిన హోటలుకు వెళ్ళకుండా కొత్త హోటలుకు భర్తా పిల్లలతో వెళ్ళడం మొదలైనవి.

—అన్ని సరదాలకంటే చీరలు కొనడం, కట్టడంపై సుమలతకి మోజు జాస్తి ఓ సారి ఓ సినిమా పత్రికలో చదివింది. ఒక సినిమా తార మూడు వందల అరవై అయిదు రోజులూ కొత్త చీరలు కడుతుందట! ఒకరోజు కట్టిన చీర మరో రోజు కట్టదట! — అలాకాకపోయినా కనీసం తాను వారానికి ఒక్కటైనా కొత్త చీర కట్టాలనే కాంక్ష ఆమెలో కలిగింది. అగ్నికి ఆజ్యం పోసినట్టుగా ఆమెకాంక్షకు పక్కఫ్లాట్‌లో వుండే కాలేజీ లెక్చరర్ వర్ధని సిమెంట్ కాంక్రీట్ వేసింది.

వర్ధని ఓ ఉమెన్స్ కాలేజీలో జూవాలజీ లెక్చరర్. వయస్సు మూడుపదులుదాటినా వివాహం కాలేదు. ఆమెకు పెళ్ళి కాలేదా? పెళ్ళి చేసుకోలేదా? పెళ్లి చేసుకునే ఉద్దేశం ఆమెకు లేదా?- మొదలైన ప్రశ్నలకు ఆమె నుంచి ఎవ్వరూ ప్రత్యక్షంగా జవాబులు రాబట్టుకొన్న సందర్భాలు




లేవు. స్త్రీ తన బ్రతుకు తాను బ్రతుకుతూనే మరో మనిషికి తిండి, సుఖము అమర్చే సాధనంగా తయారు కావడాన్ని సమాజం రూపొందించి ఓ శిక్ష వేసిందనీ ఆ శిక్షకు తాను అతీతంగా ఉండడమే తన జీవిత లక్ష్యమనీ ఒకటి రెండుసార్లు ఆమె తన అభిప్రాయాన్ని వెళ్ళబుచ్చింది. అందుకనే ఆమె పెళ్ళి చేసుకోలేదేమో అనుకొంది సుమలత. అయితే వర్ధని పురుష ద్వేషి కాదు. ఆమెకు కొంత మంది బాయ్‌ఫ్రెండ్స్ వున్నారు. వాళ్ళతో సాయంకాలాలుఇంట్లో కాలక్షేపంచేస్తుంది. క్యారమ్స్ ఆడుతుంది; పేకాట ఆడుతుంది. మ్యూజిక్ వింటుంది; సినిమాలకు వెళుతుంది; షికార్లకు తిరుగుతుంది.

ఆ ఫ్లాట్‌లో వర్ధని ఒక్కతే అద్దెకు ఉంటుంది. సంవత్సరంలో రెండు మూడు నెలలు ఆమె అమ్మ తోడుగా ఉంటుంది. మిగతాకాలంలో ఆవిడకొడుకుల దగ్గరభరణంలా బతుకుతుంది. ఆవిడను వర్ధని శాశ్వతంగా తన దగ్గర వుంచుకోవచ్చు. కాని తన ఇంటికి వచ్చేపోయే మగవాళ్ళను కళ్ళల్లో కర్పూరం పడ్డట్టుగా చూసే అలవాటు పెంచుకోవడంతో వర్ధని విసుగెత్తిపోతుంది. 'అమ్మా! ఇక్కడి వాతావరణం నీకు పడదు. నువ్వు పాతకాలపు మనిషివి, ఈ కాలపు మనుషులూ, మనుగడలూ, చేష్టలూ, సరదాలూ నీకు మింగుడు పడవు. కొంతకాలం అన్నయ్యలదగ్గర వుండిరా' అంటూ వర్ధని సాగనంపుతుంది.

వర్ధని సహజంగా సౌందర్యవతి కాకపోయినప్పటికీ, సౌందర్య సాధనాల ద్వారా 'ఫర్వాలేదు' అనిపించుకుంటుంది. భగవంతుడిచ్చిన సాధారణ అందాన్ని కాపాడుకోవడానికె తన కొచ్చే జీతాన్నంతా ఖర్చు చేస్తూ ఉంటుంది. ఆమె టైంటేబుల్ ప్రకారం కాలేజీలో పాఠాలు చెప్పినా, చెప్పకపోయినా చీరలు కడుతుంది. నెలలో ఒకటో తారీఖున కట్టిన చీర మళ్ళీ ఆ నెలలో కట్టదు. ఆమె కట్టే చీరల వెరైటీ చూసి, సెలక్షన్‌కు ముగ్ధురాలై ఆమెతో పరిచయాన్ని పెంచుకుంది సుమలత. మార్కెట్‌లోకి ఏ కొత్త రకం చీర వచ్చినా మూడోనాటికి వర్ధని శరీరాన్ని అలంకరించాల్సిందే. కొత్త చీరల రాకడను గురించి ఆమెకు అంత చురుగ్గా మార్కెట్ సమాచారం ఎలా అందుతుందో మొదట్లో సుమలత తెగ ఆశ్చర్యపడింది. చీరల మీద వర్ధనికి గల మోహం, సరదా అలాంటిది. ఆమెకు గల చీరలతో అరడజను ఫ్యాషన్ పేరేడ్లు పెట్టవచ్చు.

దేశీయ, విదేశీయ మార్కెట్లలో వస్తున్న చీరల్ని గురించీ, వాటి నాజూకూ, నాణ్యతల్ని గురించీ అప్పుడప్పుడూ వర్ధనీ, సుమలతా మాట్లాడుకుంటూ వుంటారు. అంతకు ముందు రోజు సాయంత్రమే వర్ధని మీనా బజారు నుంచి ఆల్మండ్ కలర్ మీద వైలెట్ గ్రే బోర్డర్ గల నైట్- ట్రెటాక్స్ చీరతెచ్చి ధరించింది. ఆ చీర ఎంతో అందంగా, సొగసుగా, మనోహరంగా వుంది

ఆ చీర చూసి సుమలత ఉత్తేజిత మనస్విఅయింది. అలాంటి చీరను తానూ కొని, కట్టుకోవాలన్న కోర్కె ఆమె మనసులో తటిల్లున తలెత్తింది. మరునాడు ఉదయం పదకొండు గంటలకు ఆ షాపుకెళ్ళి ఆ చీరను కొనే వరకూ సుమలత మనస్సు విశ్రాంతి పొందలేదు. ఆ చీర ప్యాకెట్టుతోనే ఆమె ఆటో దిగింది అప్పుడు.

పన్నెండు గంటలకు పగలు తీక్షణంగా వుంది.

ఆ రోజు రెండో శనివారం. వర్ధని ఇంట్లోనే వుంటుంది. వెంటనే ఆమెకు ఆ చీరను చూపెడదామనుకుంది సుమలత.

ఫస్ట్ ఫ్లోర్‌లోనే వున్నాయి ఇద్దరి ఫ్లాట్‌లూ.

గబగబా మెట్లెక్కసాగింది. సుమలత మనస్సు సీతాకోక చిలకలా వుండగా, ఆమె నాలుగో మెట్టుమీద వుండగా,

పైనుంచి దిగివస్తున్న ఓ వ్యక్తి కన బడ్డాడు. ఆరడుగుల ఆజానబాహుడు; బుగ్గమీసాలు; నల్లగా, గతుకులపడ్డ తారు రోడ్డులాంటి మొహం: కర్కశానికి మారు పేరులావున్న నిటారుగా వున్న ముక్కు; ఆరు పెగ్గుల రం పుచ్చుకున్నప్పటి కళ్ళల్లో ఎరుపు. చీకటిలాంటి ప్యాంట్ మీద నెత్తురు రంగు టీ షర్ట్; పొడువుకు మించిన లావుపాటి శరీరంతో భీకరంగా ఉన్నాడతను. పైనుంచి ఆరో మెట్టు మీద నిలబడి సుమలతకేసి గాలం విసిరినట్టు గంభీరంగా చూశాడు. ఆ చూపుకు ఆమె మహా భయంతో నిలు వెల్లా వణికిపోయింది- పెద్దపులిని ఒంట రిగా చూసిన మేకపిల్లలా.

అతను గబగబా మెట్లు దిగిపోయాడు.

నరనరాల్లో ఏదో భయం. గ్లూకోజ్ ఇంజక్షన్ ద్వారా ఎక్కినట్టు వెచ్చనైన శరీరంతో ఓ నిముషంపాటు నాలుగో మెట్టుమీదనే అప్రతిభరాలై నిలబడి పోయింది సుమలత.

స్కూటర్‌ను స్టార్ట్‌చేసిన శబ్దం. వెళ్ళి పోతున్నాడన్న మాట !

ఎవరతను? తాను ఎప్పుడూ చూడ లేదు- అనుకొంది సుమలత.

మెట్లెక్కి ఫస్టు ఫ్లోర్‌లోకి వెళ్ళింది సుమలత.

మనస్సు కొంచెం సర్దుకుంది. చేతిలో ప్యాకెట్‌తో నేరుగా వర్ధని ఫ్లాట్‌లోకి వెళ్ళింది. తలుపు కొంఛెం తెరుచుకొని వుండగా లోపలకు వెళ్ళింది.

—లోపలి దృశ్యానికి నిర్ఘాంతపోయి, నోరుతెరిచి, నిలారిపోయింది సుమలత. కేకవేయబోయింది. పెదవులు విప్పుకో లేదు- పసుగెత్తబోయింది. కాళ్ళు కదల లేదు

డ్రాయింగ్ రూమ్‌లో సోఫామీద నెత్తురు ప్రవాహంలో నీలుక్కుపోయి వుంది వర్ధని. ఆమె జాకెట్టు చినిగివుంది. బ్రాతొలగ్గా సగం రొమ్ములు కనబడు తున్నాయి. చీరంతా రక్తపు మయం. సోఫాలోంచి, చీరమడతల్లోంచి రక్తపు చుక్కలు నేలమీదకు జారుతున్నాయి. ఆ దృశ్యం భయోత్పాదంగా వుంది.

ఎవరో ఆమెను చెరచి, హత్య చేశారు.

ఆ హత్య కొన్ని నిముషాలక్రితమే

## ఓర్పు

ఒక్క క్షణం మెరుపుకోసం
ముక్కలుగా చీలుతున్న
మేఘమాల ఓర్పును
అభినందిస్తాను !
మధురమైన మాతృత్వంకోసం
బాధల మాసాలను భరిస్తున్న
కన్నతల్లి ఓర్పును
అభినందిస్తాను !
తరాల దోపిడీమీద
తిరుగుబాటు చెయ్యని
మనిషి ఓర్పును మాత్రం
అసహ్యించుకుంటాను !


— అదృష్టదీపక్


*With Best Compliments from :*

**atlas tin industries**

FABRICATORS OF QUALITY CANS, SPECIALISTS IN OIL CANS & ELE. CLIPS & CLAMPS.
ATLAS NAGAR, SOUTH END BYE-PASS ROAD, ONGOLE-523 001 Tel. No. 2499

K. V. PRASAD, M. Com., Mg. Partner
K. V. SESHA REDDY, L.C.E., Partner
K. V. SARMA, B. Com. (Hons.), Partner
B. NARASIMHA RAO, Partner.



జరిగివుంటుంది.

ఆ హంతకుడు తనకు మెట్లమీద ఎదురైన వాడే కావొచ్చు. ఎంత దారుణం?

సుమలత స్పృహ తెచ్చుకొని, తన ఇంట్లోకి పరుగెత్తింది. ఆమె గుండెల్లో భయం గుప్పుమంది. మెదడు బండబారిపోయింది. ఆలోచనలు గడ్డకట్టుకున్నాయి. అలాంటి ఘోరాన్ని ఎప్పుడూ ఆమె కళ్ళారా చూడలేదు.

ఏం చేయాలి?

పోలీసులకు ఫోను చేస్తే!— ఏం ఇబ్బంది కలుగుతుందో' ఏం చిక్కులు ఎదురవుతాయో!

—ఆఫీసుకు భర్తకు ఫోన్ చేసింది సుమలత.

'నువ్వేమీ గాభరాపడొద్దు. తలుపులు వేసుకుని ఏమీ తెలియనట్లు పడుకో. ఏం జరుగుతుందో అదే జరుగుతుంది' అని భాస్కర్ టెలిఫోన్‌లో సలహా యిచ్చాడు.

సుమలత అలానేచేసింది.కాని ఆమెలో భయం తెరలు తెరలుగా పొర్లుకొస్తూనే వుంది. మంచం మీద ముసుగు పెట్టుకుని పడుకుంది. నిద్ర రాదు. భయ పుటాలోచలతో వొళ్ళంతా సలపరంగా వుంది.

మధ్యాహ్నం మూడు గంటలకు ఎవరో తలుపు కొడితే అతి కష్టంమీద తలుపు తెరిచింది.

ఎదురుగ్గా సబ్ ఇన్‌స్పెక్టరు, పోలీసులు.

"మీపక్క ఇంట్లో హత్య జరిగింది. మీకేమైనా తెలుసా? స్టేట్ మెంట్ ఇవ్వండి" అన్నాడు ఎస్సై.

"నేను నిద్రపోతున్నాను- వొంట్లో బాగుండక. నాకేమీ తెలియదు" అని స్టేట్ మెంట్ ఇచ్చింది సుమలత.

తర్వాత ఆ కేసును గురించి దర్యాప్తు చేస్తున్నారు. హంతకుని కోసం పోలీసులు గాలిస్తున్నట్టూ మరునాడు పేపర్లో చదివింది సుమలత. ఆ హంతకుడ్ని తాను చూసినట్టు భర్తకూడా చెప్పలేకపోయిందామె.

* * *

వర్ధని హత్య జరిగి వారం రోజులైంది.

కాని సుమలత మనస్సింకా కుదుటపడలేదు.వర్షించని మేఘాలు నక్షత్రకాంతిపైన బెదిరిన గుర్రాల్లా సవారీ చేస్తున్నట్టు అవ్యక్తమైన భయపు మబ్బులు ఆమెమెదడులో చికాకుగా సంచరిస్తున్నాయి. ఆ రోజు నుంచీ ఆమె మానసిక స్థితే మారిపోయింది. దెయ్యం పట్టిన మనిషిలా తయారైంది. దేనిపైనా ఆసక్తి కనబర్చడం లేదు. దైనిక కార్యక్రమం మర్చిపోయింది. భర్తకు వేళకు కాఫీ ఇవ్వడం, టైం ప్రకారం స్నానం చేయడం,పిల్లల్ని స్కూలుకు సిద్ధం చేయడం, టిఫిన్ తయారు చేయడం, భర్త ఆఫీసు కెడుతూంటే మెట్ల దాకా వచ్చి సాగనంపడం సాయంత్రాలు భర్త రాకకోసం ఎదురు చూడటం— ఇవన్నీ మర్చిపోయింది. మనసును సహారా ఎడారి చేసుకుంది. అహర్నిశమూ ఏదో ఆలోచిస్తూ వుండసాగింది. పలకరిస్తే ఉలిక్కిపడుతుంది. పలకరించకపోతే పుస్తకంలా పడివుంటుంది.


వర్ధని హత్యను కళ్ళారా చూసి భయపడిపోయిం దనుకున్నాడు భాస్కర్. ఆమెలో భయం పోగొట్టడానికి ఎన్నో రకాలుగా చెప్పి చూశాడు.

"సుమా' జీవితం ఎల్లప్పుడూ మబ్బులేని ఆకాశంలాగావుండదు.అప్పుడప్పుడూ కారు మబ్బులు కమ్ముకొని, తాత్కాలికంగా చీకటిని సృష్టిస్తాయి, భయపెడతాయి. వర్షించిన మేఘాల వలె అవే తేలిపోతాయి. వెలుగునుచూసి ఆనందపడటం అలవాటు చేసుకున్నప్పుడు చీకటిని చూసి భయపడకుండా ధైర్యం తెచ్చుకోవాలి. అదే జీవితం!"

కాని సుమలత మనస్సులోని ముని చీకట్లు తొలగిపోలేదు.

వర్ధనిని చంపిందెవరో తనకుతెలుసు. ఆ హంతకుడ్ని తాను గుర్తుపట్టగలదు. ఆ హంతకుడు కూడా తనని గుర్తుపడతాడు. ఆ హంతకుని ఆచూకీ దొరికి, పోలీసులు పట్టుకుంటే- ఆ ఆచూకీ తానే ఇచ్చినట్టు నమ్మి, తనపై పగదీర్చుకుంటాడేమో! తనని కూడా వర్ధనిలాగే ....హత్య చేస్తాడేమో! అదే సుమలతను పట్టుకున్న భయం. ఆ భయంతోనే ఆమె మనస్సు అనుక్షణమూ అల్లాడితో






అస్తవ్యస్తమైపోతోంది.

రోజూ ఉదయం పేపరు రాగానే చూస్తుంది- వర్ధనిని చంపినవాడు పట్టుబడ్డాడేమోనని. కాని ఆ హత్య తాలూకు వివరాలు ఆ తర్వాత పత్రికల్లో రావడం లేదు.

"మనం ఇల్లు మారదామండీ!" అంది సుమలత ఓ రోజు రాత్రి భర్తతో.

"ఎందుకు?" అన్నాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

"నా కేదో భయంగా వుంది పగలు ఒంటరిగా ఇంట్లో వుండాలంటే...."

"ఈ బిల్డింగ్‌లో అరవై కుటుంబాల వారు వుంటున్నారు. అందరూ నీకు మల్లే భయపడుతున్నారా?" అన్నాడు భాస్కర్ అనునయంగా.

"మా ఊరెళ్ళి ఓ నెలరోజులు వుండి వస్తానండీ!" అంది సుమలత మరో రోజు రాత్రి.

"మరి పిల్లలూ; స్కూళ్ళూ; పరీక్షలూ" అన్నాడు భాస్కర్.

ఏం మాట్లాడలేకపోయింది సుమలత—నీళ్ళల్లోపడ్డ నిప్పులాగా అయిపోయి.

భార్య పరిస్థితి, ఆమె మానసిక ఆందోళనా గుర్తించి ఓ వారం రోజులు ఆఫీసుకు సెలవు పెట్టాడు భాస్కర్. అయినా సుమలత మనస్సులో తిష్టవేసుకున్న భయాలు సద్దుమణగలేదు. ఆమె మానసిక స్థితిలో ఆశించిన మార్పు లేదు.

"నీ కొచ్చిన బాధ, భయమూ చెప్పు సుమా!" అంటూ బ్రతిమిలాడాడు భాస్కర్. కాని ఆమె ఆ హంతకుని సంగతి చెప్పలేకపోయింది.

"ఏం లేదు? నా కేం బాధ, భయమూ!" అంది నిర్లిప్తంగా.

ఓ రోజు మొదటి ఆట సినిమాకు తీసుకెళ్ళాడు భాస్కర్ సంతోష్ థియేటర్‌కు- భార్యనూ, పిల్లల్నీ.

ఇంటర్‌వెల్‌లో అందరూ బయటికొచ్చారు పిల్లలకు ఐస్‌క్రీమ్ కేక్స్ కొనిపెట్టి తాను టీ త్రాగుతూ కాఫీ హౌస్ ముందున్నాడు భాస్కర్. టాయిలెట్ రూమ్ కెళ్ళింది సుమలత. ఆమె తిరిగి వస్తుండగా




హఠాత్తుగా ఆ హంతకుడు ఎదురయ్యాడు. అదేరూపం! అవేకళ్ళు అవే బుగ్గమీసాలు! రక్తపు రంగు చొక్కా. చీకటిలాంటి ప్యాంటు!

అతన్ని చూడగానే గాబరాతో గొంగళి పురుగులా ముడుచుకుపోయింది సుమలత.

ఆమెను చీల్చి చెండాడతానన్నట్టు తీక్షణంగా చూశాడతను.

హాలులాబీలో జనం అటూ, ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు.

ఆమె ధైర్యంగా అడుగు ముందుకేయబోయింది. అతను వేయ్యనివ్వలేదు.

"మేడమ్...." అన్నాడతను ఖంగుమనే స్వరంతో.

భయంగా మొహం ఎత్తి చూసింది సుమలత.

"గుర్తున్నానా!.... మర్చిపో! మరెవరికైనా నా సంగతి చెప్పావా! నీకూ.... అదే గతి పడుతుంది. జాగ్రత్త!" అని వెళ్ళిపోయాడతను చకచకా.

విభ్రమచేతస్కురాలై, మళ్ళీ హాలులోకి అడుగు పెట్టలేదు సుమలత. తల నొప్పిగా వుందని భర్త, పిల్లలతో ఎనిమిది గంటలకే ఇంటి కొచ్చింది ఆమె.


ఆ రాత్రి అపరాత్రి దాకా అశాంతిగా ఆలోచిస్తూనే వుంది సుమలత. తనుతప్పు చేయలేదు. ఒకరు చేసిన నేరానికి పరోక్షంగా సాక్షి. ఆ నేరస్థుడ్ని తానుచూడకపోతే ఈ ప్రత్యక్ష నరకం ఉండేదికాదుగా! భగవంతుడా ఆడదానికి ఇంత బలహీనమైన గుండెనెందుకు పెట్టావు? ముల్లు వచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకు ముల్లుమీద పడ్డా— అరిటాకుదే తప్పా? చేయని నేరానికి ఇంత శిక్ష విధింపా? జీవితంలో ఇలాంటి సందర్భాలు, సంఘర్షణలు, సమస్యలు, సంకట పరిస్థితులు ఎదురవుతాయా?......... ఆవిధంగా ఆలోచిస్తూ ఎప్పుడో తెల్లవారుజామున పాలవాడ్ వచ్చే సమయానికి నిద్రపోయింది సుమలత.

* * *

రోజు పేపరు చూస్తూనే వుంది సుమలత.

వర్ధనిని హత్య చేసినవాడు పట్టుబడ్డ ఉదంతమేమీలేదు. ఒకరకంగా ఆమెకు రిలీఫ్ కలుగుతోంది.

రవీంద్ర భారతిలో ఆ రోజు ఒక డ్యాన్సు ప్రోగ్రాంవుంటే బలవంతాన




భార్యను బయలుదేరదీశాడు భాస్కర్. కారు ఎక్కేదాకా తాను రానని పోరుపెడుతూనే వుంది సుమలత. అయినా భాస్కర్ ఒప్పుకోలేదు. ఆమెను అటూ, ఇటూ తిప్పితే ఆమె మనస్సు శాంతిస్తుందని, ఏదో వ్యాపకంలో పడి గ్లాని తగ్గుతుందని అతని ఆలోచన.

హిమాయత్ నగర్ "తెలుగు అకాడమి" సెంటర్‌కు రాగానే అంతదూరంలో కారు ఆపాడు భాస్కర్. ముందు జనం మూగివున్నారు. ఎదురుగా వేగంగా వస్తున్న లారీ కింద పక్క వీధిలోంచి వేగంగా క్రాస్ చేస్తూన్న స్కూటర్ పడిందట! అదంతా జరిగి అయిదు నిమిషాలు కూడా కాలేదట!

భాస్కర్ కారు దిగాడు ఆ దృశ్యాన్ని చూడటానికి.

అతని వెంటే సుమలత కూడా దిగింది యాంత్రికంగా.

లారీ చక్రాల కింద స్కూటర్ అప్పడంలా పడివుంది. ఆ స్కూటర్ మీదున్న వ్యక్తి మూడుమీటర్ల ఇవతలగా నెత్తురుముద్దలా పడి వున్నాడు........రక్తపు రంగు టీషర్ట్, చీకటి లాంటి నల్లప్యాంటు, బుగ్గమీసాలు, ఆరడుగుల ఆజాను బాహుడు....

అతన్ని గుర్తించింది సుమలత. అతనే వర్ధనిని హత్య చేసిన హంతకుడు.

"ఎవరో అభాగ్యుడు పాపం........!"

అన్నాడు భాస్కర్ సానుభూతిగా.

కాని సుమలత మనస్సు భయపు మబ్బులు విడిపోగా ఆనందానుభూతితో కొండంత 'రిలీఫ్'ను పొందింది.

'అభాగ్యుడు కాదు పాపాత్ముడు! చేసిన పాపానికి తగిన పరిహారాన్ని పొందాడు.' అనుకుంది సుమలత. కాని ఆ మాటలు పైకి ధైర్యంగా అనలేకపోయింది భర్తతో.

దీపావళి శుభాకాంక్షలతో!

గోడౌనులకు, లారీలకు, మిల్లులు మరియు ఫ్యాక్టరీల వారి సరకుల భద్రతకు; కావలసిన సైజులలో టార్పాలిన్స్ మాచే తయారు చేయబడుచున్నవి మరియు మీ పొలములకు వాటరుప్రూఫ్ పైపులు కూడా తయారు చేయబడుచున్నవి. కావలసినవారు ఈక్రింది అడ్రసుకు సంప్రదించగోరుతాము.

నేషనల్ తార్పాలిన్స్

వాటర్‌ప్రూఫ్ తార్పాలిన్స్, వాటర్‌ప్రూఫ్ పైపు & బాగ్స్ వగైరా తయారీదారులు

No. 01. / 18. / 01679. / P. M. T. / SSI APSI, Date 30—5—81

డోరు నెం. 2-156, గుంటూరు రోడ్, ఒంగోలు-523001.

ఫోన్ : పి. పి. 2680

ప్రొప్రయిటర్ : యం. నాగరాజు